సాక్షి అనంతపురం

శనివారం । 31 । మే । 2025



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు ప్రకారం విక్రయాలు జరిగాయి.



స్వయం ఉపాధి పొందేదెన్నడో?

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు. స్వయం ఉపాధి లోన్ల విషయంలో నిర్లక్ష్యం తగదంటున్నారు.

10లో

గరిష్ఠం/కనిష్ఠం

34.2°/23.5°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు 15,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయంలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. గత ఏప్రిల్ 24 వరకు జీరో ఇన్‌ఫ్లో ఉండి 6.871 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. అదే ఈ నెల మొదటి వారం నుంచి ఇన్‌ఫ్లో మొదలవడంతో శుక్రవారం ఉదయానికి 15,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదై నీటి నిల్వ 13.680 టీఎంసీలకు చేరింది. ఎగువ భాగం ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు, శివమొగ్గ, సాగర, శృంగేరి తదితర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో వరద నీరు డ్యాంలోకి వచ్చి చేరుతోంది. టీబీ డ్యాం లో 1,633 అడుగులకు గాను 1592.96 అడుగుల నీటి మట్టం చేరింది. అవుట్‌ఫ్లో 153 క్యూసెక్కులు ఉంది. కాగా గత ఏడాది ఇదే సమయానికి 3.330 టీఎంసీల నీరు నిల్వ ఉండి, ఇన్‌ఫ్లో జీరో, అవుట్‌ఫ్లో 30 క్యూసెక్కులు ఉండేది.

విత్తన నాణ్యతలో రాజీ పడం



వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న జేడీఏ

అనంతపురం అగ్రికల్చర్/ బెళుగుప్ప: నాణ్యతా ప్రమాణాల మేరకు విత్తన వేరుశనగ శుద్ధి (ప్రాసెసింగ్) చేపట్టి రైతులకు మంచి విత్తనం అందేలా చూడాలని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శుక్రవారం అనంతపురంలోని విజయ ఆగ్రోసీడ్స్, బాలాజీ ట్రేడర్స్, వేంకటేశ్వర ట్రేడర్స్ ప్రాసెసింగ్ ప్లాంట్లతో పాటు బెళుగుప్పలో ఉన్న ప్రాసెసింగ్ ప్లాంట్లను సందర్శించారు. అక్కడ జరుగుతున్న విత్తనశుద్ధి కార్యక్రమాన్ని పరిశీలించారు. మొలకశాతం, అవుటన్ గురించి ప్రయోగాత్మకంగా తెలుసుకున్నారు. సరఫరాకు సిద్ధంగా ఉన్న వేరుశనగ బస్తాలు తూకం వేసి చూశారు. విత్తన నాణ్యత విషయంలో రాజీపడేది లేదని, నాసిరకమని గుర్తించినా, బాగా లేవని వెనక్కి వచ్చినా సంబంధిత ప్లాంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 40 శాతం రాయితీతో 50,952 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే అదనపు కేటాయింపులు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే ఆర్‌ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్లు కూడా మొదలుపెట్టామని, జూన్ మొదటి వారంలోనే పంపిణీ చేస్తామని తెలిపారు. జేడీఏ వెంట ఏడీఏ ఎం.రవి, టెక్నికల్ ఏఓ రాకేష్‌నాయక్, ప్రాసెసింగ్ ప్లాంట్ల పర్యవేక్షక ఏఓలు కిరణ్‌కుమార్‌రెడ్డి, సాయిలక్ష్మి, శేఖర్‌రెడ్డి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

కంత్రీ ఖాకీలు

ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో ప్రవాస భారతీయుడిని మోసం చేసిన కేసు మలుపులు తిరుగుతోంది. పుట్టపర్తిలో జరిగిన ఘటన పోలీసుల పుణ్యమా అని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దొంగలకే దొంగ, కేటుగాళ్లకు కేటుగాడు వంటివి సినిమాల్లోనే చూస్తుంటాం. కానీ పుట్టపర్తి పోలీసులు పట్టపగలే తమ కార్యాలయంలోనే ఇలాంటివి చూపించారు.

ఎన్‌ఆర్‌ఐని చీటింగ్ చేసిన కేసులో భారీ ట్విస్టులు

- నిందితుడిని పోలీస్‌స్టేషన్‌లో పెట్టి స్థిరాస్తుల బదలాయింపు
- పోలీసుల ఆధ్వర్యంలోనే నిందితుడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి
- కేసు నమోదు చేసిన వారానికి అరెస్టు చూపించిన పోలీసులు
- పోలీసు అధికారులకు రూ.50 లక్షల డీల్ కుదిర్చిన టీడీపీ నేతలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రవాస భారతీయుడైన ఆర్వీన్ మహేంద్రకర్‌ను పుట్టపర్తికి చెందిన సత్యనారాయణ రాజు రూ.12.50 కోట్ల మేర మోసం చేశారు. ఈ కేసులో బాధితుడికి పెద్దగా లాభం చేకూరకపోగా నిందితుడి నుంచి పోలీసులకు, తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు, ద్వితీయశ్రేణి నాయకులకు బాగా లబ్ధి కలిగింది.

పోలీసులకు రూ.50 లక్షల డీల్

ఎన్‌ఆర్‌ఐ మోసపోయిన కేసులో పోలీసులకు రూ.50 లక్షల డీల్ కుదిరినట్టు తెలిసింది. ఈ నెల 22న బాధితుడి ఫిర్యాదు మేరకు సత్యనారాయణ రాజుపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినా.. 28వ తేదీ వరకు అరెస్టు చూపించలేదు. ఈ ఏడు రోజుల పాటు నిందితుణ్ని స్టేషన్‌లో హింసించి.. లొంగదీసుకుని దారికి తెచ్చుకున్నారు. టీడీపీకి చెందిన ఇద్దరు అన్నదమ్ములు, ఒక మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించారు. తాము చెప్పినట్టు చేస్తే మీకు రూ.50 లక్షలు ఇస్తామని టీడీపీ నాయకులు పోలీసు అధికారికి చెప్పడంతో తలూపిన సదరు అధికారి బాధితుణ్ని గోప్యంగా ఉంచి.. చేయాల్సిందంతా చేశారు.

ఆస్తుల బదలాయింపు

నిందితుడి పేరిట ఎక్కువ మొత్తంలో భూములు, స్థలాలు ఉన్నాయి. వీటిని కొట్టేయాలనేదే ప్రధాన ఆలోచన. పథకంలో భాగంగా అరెస్టుకు ముందే నిందితుడి పేరున ఉన్న కొన్ని భూములు ఓ మహిళ (ఎన్‌ఆర్‌ఐ భార్య) పేరిట బదలాయించారు. ఈమె పుట్టపర్తిలో పూల వ్యాపారం చేసుకునేది. వీసా సమస్య వస్తుందని గతంలో మహేంద్రకర్‌కు సదరు మహిళతో ప్రస్తుత నిందితుడు సత్యనారాయణరాజు పెళ్లి జరిపించారు. ప్రవాస భారతీయుడైన మహేంద్రకర్‌కు ఇక్కడి విషయాలు తెలియవు. దీంతో ఈమెను టీడీపీ నాయకులు, పోలీసులు భయపెట్టి తమ వైపు తిప్పుకున్నారు. ఈ నేపథ్యంలో సత్యనారాయణరాజు పేరుపై ఉన్న ఆస్తులు బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో (డాక్యుమెంటు నంబర్లు 1563, 1564, 1584) ఆమె పేరుపై బదలాయించారు. ఏకంగా పోలీసుల సమక్షంలోనే ప్రైవేటు ఎస్కార్టు వాహనాల్లో నిందితుణ్ని తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించారంటే పోలీసులు ఏ స్థాయిలో బరితెగించారో అంచనా వేయొచ్చు. ముందుగా ఆమె పేరుతో బదలాయించి.. ఆ తర్వాత తక్కువ ధరకు టీడీపీ నేతలు రాయించుకోవాలనేది ఎత్తుగడ. నిందితుణ్ని వారం రోజులు అరెస్టు చూపించకుండా చేసిన వ్యవహారం తాజాగా బయటకు వచ్చింది. ఇక్కడ భారీగా లబ్ధిపొందిన పోలీసు అధికారిపై గతంలోనూ పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐతో కలిసి పోలీసు బాస్‌లకు వసూళ్లు చేసి పెట్టడంలోనూ ఈ అధికారికి ప్రమేయమున్నట్టు తెలుస్తోంది. ప్రశాంతి నిలయానికి కూతవేటు దూరంలో జరుగుతున్న ఈ అరాచకాలు సత్యసాయి భక్తులకు విస్మయం కలిగిస్తున్నాయి. ఎన్నో దేశాల నుంచి సాయి సన్నిధికి భక్తులు వస్తుంటారు. ఇలా పోలీసులే నిందితుల నుంచి వసూళ్లు మొదలెడితే పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. తీవ్ర విమర్శలు రావడంతో పుట్టపర్తి పోలీసులు తమను తాము కాపాడుకునే పరిస్థితికి వచ్చారు.

తహసీల్దార్లను నియమించేరా..?

- ఆరు మండలాలకు ఇన్‌చార్జీలే దిక్కు
- అనంతపురం డివిజన్ డీఏఓ పోస్టూ ఖాళీ
- జూన్2న రిటైర్ కానున్న శెట్టూరు తహసీల్దార్

అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖలో ఆరు మండలాలకు తహసీల్దార్లు లేరు. ఇన్‌చార్జ్‌లతో పాలన సాగిస్తున్నారు. ఇక శెట్టూరు తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి జూన్ 2న ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో ఆ స్థానం కూడా ఖాళీ కానుంది. ప్రస్తుత బదిలీల్లోనైనా ఈ మండలాలకు రెగ్యులర్ తహసీల్దార్లను అధికారులు నియమిస్తారా లేదా అనే చర్చ రెవెన్యూ వర్గాల్లో నడుస్తోంది. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలానికి రెగ్యులర్ తహసీల్దారును ఏడాదిగా నియమించకుండా ఇన్‌చార్జ్ ద్వారా పాలన నడిపిస్తున్నారు. ఇక విడపనకల్లు, వజ్రకరూరు, కణేకల్లు, డి.హీరేహాళ్, యల్లనూరు మండలాల్లోనూ తహసీల్దారు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర మండల తహసీల్దార్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ డీఏఓగా ఉన్న తహసీల్దార్ విజయలక్ష్మి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది చిత్తూరుకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ స్థానంలో వేరొకరిని నియమించలేదు. ఇన్‌చార్జ్ పాలన కారణంగా ప్రజలకు సేవలు సకాలంలో అందడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పాయింట్లపై ఫిర్యాదుల వెల్లువ

- స్టేషన్ పాయింట్లు 24కు మించి ఉండకూడదు
- 26, 28, 30 పాయింట్లు పొందిన టీచర్లపై ఫిర్యాదులు
- స్కూల్ అసిస్టెంట్ల తాత్కాలిక సీనియార్టీ జాబితాల విడుదల
- అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అధికారులు
- నేడు ఎస్జీటీల తాత్కాలిక సీనియార్టీ జాబితా విడుదల



డీఈఓ దృష్టికి అభ్యంతరాలు తీసుకెళ్తున్న ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: బదిలీల్లో భాగంగా ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా నమోదు చేసుకున్న పాయింట్లపై శుక్రవారం ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గురువారం అర్ధరాత్రి స్కూల్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితాలకు సంబంధించిన తాత్కాలిక సీనియార్టీ జాబితాలు విడుదలయ్యాయి. శుక్రవారం ఉదయాన్నే పరిశీలించి.. కొందరు పాయింట్లు ఎక్కువ వేసుకోవడాన్ని గుర్తించి నగరంలోని శారదా నగరపాలక ఉన్నత పాఠశాల వద్దకు పరుగులు తీశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచర్లు తరలివచ్చారు. ఒక స్కూల్‌లో ఎన్నేళ్లు పనిచేసినా గరిష్ఠంగా ఎనిమిదేళ్లకు 24 పాయింట్లు (3వ కేటగిరీ) పొందాలి. ఒక టీచరు పదేళ్లు పనిచేసినా వేసుకోవాల్సింది 24 పాయింట్లు. ఆ రకంగా సీలింగ్ పెట్టారు. సాంకేతిక సమస్య కారణంగా ఎన్నేళ్లు నమోదు చేసినా అన్ని పాయింట్లు పడ్డాయి. రీఅపోర్షన్‌కు గురైన టీచర్లు కూడా ఇష్టానుసారంగా పాయింట్లు నమోదు చేశారు. దీనిపై ఎంఈఓలు, డీఈఓలు పరిశీలించి అభ్యంతరాలు స్వీకరించి అదనంగా పడిన పాయింట్ల తొలిగింపునకు సిఫార్సు చేయాలంటూ విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. దాదాపు ఏ ఒక్క మండలంలోనూ ఈ పని జరగలేదు. ఎంఈఓల లాగిన్లకు వచ్చిన దరఖాస్తులను వచ్చినవి వచ్చినట్టు అప్రూవల్ చేసి డీఈఓ లాగిన్‌కు పంపారు. డీఈఓ కార్యాలయ టెక్నికల్ సిబ్బంది కూడా వాటిని వెంటనే అప్రూవల్ చేసి రాష్ట్ర కార్యాలయానికి పంపారు.

300కు పైగా అభ్యంతరాలు

స్కూల్ అసిస్టెంట్ల తాత్కాలిక సీనియార్టీ జాబితాలను పరిశీలించిన టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున అభ్యంతరాలు తెలిపారు. సుమారు ఆధారాలతో రాతపూర్వకంగా 300కు పైగా ఫిర్యాదులు చేశారు. వాటన్నింటినీ డెప్యూటీ డీఈఓల ద్వారా రాష్ట్ర అధికారుల లాగిన్లకు పంపారు. శనివారం రోజుకు ఫైనల్ జాబితా విడుదల కానుంది. ఆలోగా ఎన్ని అభ్యంతరాలు పరిష్కారమవుతాయో.. తాము ఎన్నో స్థానంలో ఉంటామోనన్న ఆందోళన చాలామంది టీచర్లకు పట్టుకుంది. కాగా శనివారం ఎస్జీటీ తాత్కాలిక సీనియార్టీ జాబితా విడుదల కానుంది.

ప్రిఫరెన్షియల్ కేటగిరీపై దుమారం

చాలామంది అనర్హులు ప్రిఫరెన్షియల్ కేటగిరీ జాబితాలో కనిపించడం పట్ల ఉపాధ్యాయుల్లో దుమారం రేపుతోంది. గార్లదిన్నె మండలంలో పని చేస్తున్న ఓ టీచరు.. కంటి చూపు తగ్గిందని వైద్య ధ్రువీకరణ పత్రం పొంది ప్రిఫరెన్షియల్ కేటగిరీలో హెచ్‌ఎం పదోన్నతి పొందడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. స్కూల్ అసిస్టెంట్ల తాత్కాలిక సీనియార్టీ జాబితాలోనూ ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ఉన్న టీచర్ల పేర్లను చూసి కంగుతింటున్నారు. సీకేపల్లి, అనంతపురం రూరల్, గుత్తి, రొళ్ల, శింగనమల, బత్తలపల్లి, కూడేరు, కణేకల్లు, ధర్మవరం, పెనుకొండ తదితర మండలాల పరిధిలోని స్కూళ్లల్లో కొందరు టీచర్లు నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. అన్ని అవయవాలు బాగున్నవారు కూడా ఈ జాబితాలో కనిపిస్తున్నారంటూ వాపోతున్నారు. 50 ఏళ్లు దాటిన తర్వాత సహజంగానే వివిధ రోగాల బారిన పడుతుంటారని, కొందరు వాటిని అసరగా చేసుకుని ఫేక్ మెడికల్ సర్టిఫికెట్లు పొందారంటున్నారు. ఎస్జీటీల జాబితాల్లో కుప్పలుతెప్పలుగా నకిలీరాయుళ్లు కనిపిస్తారంటున్నారు.

16 మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 16 మండలాల్లో వర్షం కురిసింది. 4.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. గుంతకల్లు 28.2, వజ్రకరూరు 23.2, బుక్కరాయసముద్రం 22.2, పామిడి, కళ్యాణదుర్గం 11.4 మి.మీ వర్షం కురిసింది. రాయదుర్గం, నార్పల, పెద్దవడుగూరు, యాడికి, గార్లదిన్నె, కూడేరు, పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, అనంతపురం, శింగనమల మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం పడింది. రాగల రెండు రోజులు కూడా జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

- ప్రాజెక్టులపై అంతులేని నిర్లక్ష్యం
- ఎన్నికల హామీల అమలులో తాత్సారం
- జూన్ నాలుగో తేదీ వెన్నుపోటు దినం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రాయలసీమ ప్రయోజనాలను ఏమాత్రమూ పట్టించుకోని ద్రోహి ముఖ్యమంత్రి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తొలిసారిగా తాను రాయలసీమ ప్రాంత వాసి అని మహానాడులో చెప్పారని, ఆయనకు ఈ ప్రాంతం ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. హంద్రీ–నీవా ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం గండికోట రిజర్వాయర్‌ను పట్టించుకోకపోవడం, పోతిరెడ్డిపాడుకు వ్యతిరేకంగా కోస్తా జిల్లా నేతలతో కలిసి ధర్నాలు చేయడం, విభజన హామీల్లో అనంతపురం జిల్లాకు కేటాయించిన ఎయిమ్స్‌ను మంగళగిరికి తరలించడం, కర్నూలుకు రావాల్సిన హైకోర్టును.. బెంచ్ వరకే పరిమితం చేయడం వంటివి చేసిన చంద్రబాబును ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ క్షమించబోరన్నారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో గాలేరు నగరి, హంద్రీ–నీవాకు పునాదిరాయి మాత్రమే వేశారని, 1996 నుంచి ఏళ్ల తరబడి సీఎంగా పని చేసిన చంద్రబాబు ఆ ప్రాజెక్టులను ఒక్క కిలోమీటర్ కూడా ముందుకు తీసుకెళ్లలేకపోయారని విమర్శించారు. 40 టీఎంసీల సామర్థ్యం గల హంద్రీ–నీవాను 5 టీఎంసీలకు కుదించి రాయలసీమకు తీరని అన్యాయం చేశారన్నారు.

రాయలసీమకు ప్రాధాన్యతనిచ్చిన జగన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక హంద్రీ–నీవాను అనంతపురం, కర్నూలు జిల్లాకు పరిమితం చేసి, గండికోట నుంచి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు నీరందించి హంద్రీ–నీవాను అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుని.. సీమకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని అనంత పేర్కొన్నారు. జగన్ హయాంలో గండికోటకు 27 టీఎంసీల నీరు తీసుకువచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో హంద్రీ–నీవాకు రూ.4వేల కోట్లు ఖర్చు పెట్టామని చెబుతున్నారని, మరి జగన్ హయాంలో రూ.2వేల కోట్లకుపైగా ఖర్చు చేసిన విషయాన్ని దాచిపెడితే ఎలా బాబూ అన్ని ప్రశ్నించారు.

అరచేతిలో వైకుంఠం

హామీలు నెరవేర్చాలంటే తనను అధికారం నుంచి దించవద్దని, మళ్లీ గెలిస్తేనే హామీలకు గ్యారెంటీ అని, ఇప్పట్లో హామీలను నెరవేర్చే పరిస్థితి లేదని చెప్పకనే చెబుతూ సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపారని అనంత మండి పడ్డారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అమలు చేస్తామని.. అధికారంలోకి వచ్చాక ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షలకు పైగా పింఛన్ల కోత విధించి అర్హులకు అన్యాయం చేశారన్నారు.

మహానాడు పేరిట మహాడ్రామా

కడపలో టీడీపీ నిర్వహించింది మహానాడు కాదని మహాడ్రామా అని అనంత వెంకటరామిరెడ్డి ఎద్దేవా చేశారు. మూడు రోజుల కార్యక్రమమంతా ఆత్మస్తుతి పరనిందగా సాగిందన్నారు. ప్రజలకు ఏం చేస్తామనే విషయంపై నోరు మెదపలేదన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చివరి దశలో చంద్రబాబును ఉద్దేశించి ఏం మాట్లాడారో ఆ వీడియోలను మహానాడులో ప్రదర్శించి ఉంటే బాగుండేదన్నారు. మామకు చేసిన మోసాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో మభ్యపెట్టాలని చూస్తే ప్రజలు నమ్మబోరన్నారు. లోకేష్ తనకు తాను యువరాజులా భావిస్తూ ఆరు శాసనాలు అనడం, దాన్ని గేమ్‌ఛేంజర్ అంటూ చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో శాసనాలు ఉండవని గుర్తు చేశారు. వ్యవస్థలను చేతిలో పెట్టుకుని రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న లోకేశ్‌కు స్థానిక ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

జూన్ 4న వెన్నుపోటు దినం

ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి చేసిన మోసాన్ని వివరిస్తూ జూన్ 4న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినాన్ని చేపడుతున్నట్లు అనంత తెలిపారు. సమన్వయకర్తలతో కలసి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, ఓబిరెడ్డి, మల్లెమీద నరసింహులు, చింతా సోమశేఖర్‌రెడ్డి, నాయకులు కృష్ణవేణి, మధు, కేశవరెడ్డి, పుల్లయ్య, గుజ్జల శివయ్య, సాకే శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల వద్దే రేషన్

- నిస్సహాయులకు ఇంటి వద్దకే పంపిణీ

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా రేషన్‌కార్డుదారులకు జూన్ నెలకు సంబంధించి బియ్యం, తదితర సరుకులు చౌక ధరల దుకాణాల (స్టోర్) వద్దే పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. 65 ఏళ్ల వయసున్న వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, దివ్యాంగులకు 1 నుంచి 5వ తేదీ వరకు ఇంటి వద్దనే పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. చౌక దుకాణాల్లో ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేస్తారని వెల్లడించారు. ఈ క్రమంలో డీలర్లు కార్డుదారులకు అసౌకర్యం కల్పించినా, ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫైళ్లు సమగ్రంగా సిద్ధం చేయాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: నిషేధిత భూముల జాబితాలో ఉన్న చుక్కల భూములు, 22ఏ భూముల ఫైళ్లను సమగ్ర వివరాలతో సిద్ధం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డాటెడ్ ల్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత జాబితాలోని భూముల ఫైళ్లు సమగ్రంగా లేకపోతే వాటిని పరిష్కరించలేమన్నారు. చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని వివరాలు, అవసరమైన డాక్యుమెంట్‌లు సమగ్రంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం 22ఏకు సంబంధించి 16 క్లెయిమ్‌లను, చుక్కల భూములకు సంబంధించి 31 దరఖాస్తులను పరిశీలించారు. వాటిలో అన్ని వివరాలు సక్రమంగా ఉన్నవాటిని ఆమోదించారు. వివరాలు సమగ్రమంగా లేని వాటిని పునః పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఆర్‌బీఎస్‌కే శ్రీనివాస్, భూ విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, కళ్యాణదుర్గం తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగంలో చోటు


ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి


ఎల్లారెడ్డి గారి ప్రణయ్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ యువజన విభాగంలో పలువురికి చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి (అనంతపురం), రాష్ట్ర కార్యదర్శిగా బి.రాజేష్ (ఉరవకొండ), రాష్ట్ర అధికార ప్రతినిధిగా గొర్ల మారుతీనాయుడు, రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా జి.రామాంజినేయులు (కళ్యాణదుర్గం), వాసగిరి నాగ్ (అనంతపురం), జోనల్ అధ్యక్షుడిగా వై.ప్రణయ్‌రెడ్డి (ఉరవకొండ) నియమితులయ్యారు.

'ఖజానా'లో బదిలీల సందడి

అనంతపురం అర్బన్: ఉమ్మడి జిల్లా పరిధిలోని ఖజానా శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై బదిలీల నిర్వహణ కమిటీ సభ్యులు అనంతపురం జిల్లా డీడీ వెంకటేశ్వర్లు, ఏటీఓ రాణి, శ్రీసత్యసాయి జిల్లా డీడీ శ్రీనివాసులు, ఏటీఓ పవిత్ర శుక్రవారం అనంతపురంలోని ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ చాంబర్‌లో సమీక్షించారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో 34 మంది సీనియర్ అకౌంటెంట్లు, 15 మంది జూనియర్ అకౌటెంట్లు, 12 మంది ఆఫీస్ సబార్డినేట్లు చొప్పున మొత్తం 61 మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీనియర్ అకౌంటెంట్లు 19 మంది, జూనియర్ అకౌంటెంట్లు 9 మంది, ఆఫీసు సబార్డినేట్లు 8 మంది ఉన్నారు. అనంతరం డీడీ వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ.. ఖజానా శాఖలో బదిలీలకు సంబంధించి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ అంటూ ఏదీ ఉండదన్నారు. ఖాళీల జాబితా ప్రకటించామని, బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఆ మేరకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. వారి దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం బదిలీ ప్రక్రియ పూర్తి చేసి స్థానాలను కేటాయిస్తామన్నారు.

రైల్లో నగలు చోరీ చేస్తూ పట్టుబడిన దొంగ


నిందితుడిని విచారణ చేస్తున్న పోలీసులు

గుత్తి: రైలులో నగదు, నగలు చోరీ చేస్తూ ఓ దొంగ పట్టుపడ్డాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన మేరకు... శుక్రవారం మచిలీపట్నం – ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలులోని కోచ్-1లో ప్రయాణిస్తున్న ఓ యువకుడు ఓ ప్రయాణకుడి బ్యాగ్‌లోని బంగారు నగలు, నగదు, సెల్‌ఫోన్లు అపహరిస్తుండగా గమనించి మరో ప్రయాణికుడు వెంటనే పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాడు. రైలు గుత్తి రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, సివిల్ కానిస్టుబుల్ భాస్కర్ నాయుడు కోచ్-1లోకి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఒకటిన్నర తులం బంగారు ఆభరణాలు, రూ.10 వేలు నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువకుడు నంద్యాల జిల్లాకు చెందిన జయరాజ్‌గా గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని సమగ్ర విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాసిజం.. బానిసత్వం

బాసిజం... బానిసత్వం ఈ రెండూ నాటికి, నేటికీ రెవెన్యూ శాఖను వీడడం లేదు. ఇది ఏ ఒక్క స్థాయిలోనో అనుకుంటే పొరపాటే. అన్ని స్థాయిల్లోనూ ఇదే తీరు కొనసాగుతోంది. ఇదేమని ప్రశ్నిస్తే మరింత అణచివేత... విధుల పరంగా వేధింపులు తప్పడం లేదు. దీంతో కింది స్థాయి ఉద్యోగులు మౌనంగానే తమ బానిసత్వాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా బదిలీల ప్రక్రియలో బాసిజం ప్రభావానికి ఉద్యోగులు లోనవుతున్నారు.



- రెవెన్యూ శాఖలో అన్ని స్థాయిల్లోనూ ఇదే తీరు
- బదిలీల్లోనూ ఇదే వైఖరి
- ఉద్యోగులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ అంటూ లేదు
- అధికారులు పోస్టింగ్ ఇచ్చిన చోటుకు వెళ్లాల్సిందే

అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగంలో కీలకంగా ఉండే రెవెన్యూ శాఖ అన్నింటికీ భిన్నంగా వ్యవహరిస్తోంది. ప్రధానంగా ఈ శాఖలో ఉన్నతాధికారుల బాసిజానికి కింది స్థాయి ఉద్యోగులు బానిసలుగా మారక తప్పడం లేదు. ముఖ్యంగా బదిలీల ప్రక్రియలో ఈ పరిస్థితి మరింత స్పష్టంగా బయటపడుతోంది. అన్ని శాఖల్లోలా ఇక్కడి ఉద్యోగులకు బదిలీలకంటూ ప్రత్యేక కౌన్సెలింగ్ ఉండకపోవడమే ఇందుకు నిదర్శనం. బదిలీ కోసం స్థానాల ఆప్షన్లతో దరఖాస్తు చేసుకోవడం వరకే ఉద్యోగుల వంతు.. అటు తర్వాత ఆ స్థానానికి వారిని బదిలీ చేస్తూ పోస్టింగ్ ఇవ్వడం అనేది అధికారుల చేతుల్లో ఉంటుంది. ఆప్షన్ ప్రకారం ఇవ్వచ్చు... లేదా ఇవ్వని స్థానానికి బదిలీ చేయవచ్చు. 'ఎందుకు?... ఏమిటి?... ఎలా?' అని మాత్రం ప్రశ్నించకూడదు. ఒకవేళ ఎవరైనా ప్రశ్నిస్తే వారు 'చుక్కలు' చూడాల్సిందే. ఇక 'మేనేజ్' చేసుకునే సామర్థ్యం ఉన్నవారు కోరిన చోట పోస్టింగ్ పొందవచ్చు. ఈ మాటలు అంటున్నది ఎవరో కాదు... సాక్షాత్తూ బానిసత్వాన్ని ప్రత్యక్షంగా అనుభవిస్తున్న రెవెన్యూ ఉద్యోగులే కావడం గమనార్హం.

అన్ని స్థాయిల్లోనూ బాసిజం

రెవెన్యూ శాఖలో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయి వరకు బాసిజం ఏ స్థాయిలో ఉందో అంతకంటే ఎక్కువ స్థాయిలో బానిసత్వమూ కనిపిస్తోంది. గ్రామ స్థాయి అధికారి తన కింద వారిపై బాసిజం చూపిస్తూ.. పైవారు ఏది చెప్పినా కాదనకుండా చేస్తారు. మండలస్థాయి అధికారి తన కింద వారిపై బాసిజం చూపిస్తారు. డివిజన్, జిల్లా స్థాయి అధికారులు ఏది చెప్పినా (ఆర్థిక, ఆర్థికేతర) కిమ్మనకుండా ఆగమేఘాలపై చేసి పెడతారు. ఒక ఆదేశం జిల్లా స్థాయి అధికారి నుంచి డివిజన్ స్థాయి అధికారికి వస్తే... ఆ ఆదేశం వెంటనే మండల స్థాయికి... అక్కడి నుంచి గ్రామ స్థాయికి వెళుతుంది. ఎలా చేస్తారు? అనేది పైవారికి అవసరం లేదు. వారు చెప్పింది చేయాలి... చేయకపోతే 'సినిమా' చూడాల్సిందే.

ఇక్కడ నో కౌన్సెలింగ్

ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులకు బదిలీల సమయంలో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ప్రకియ అనేది నిర్వహించడం పరిపాటి. అదికూడా ఉద్యోగుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహిస్తుంటారు. చివరికి పోలీసు శాఖలోనూ కౌన్సెలింగ్ నిర్వహించి జాబితాలో చూపించిన ఖాళీల్లో వారు కోరుకున్న స్థానాలకు బదిలీ చేస్తుంటారు. ఇక మెప్మా, గ్రంథాలయ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్‌ను స్వయంగా జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. అయితే రెవెన్యూశాఖలో ఈ విధానం భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. ఇక్కడ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ విధానం లేదు. బదిలీలు చేయడంలోనూ అధికారుల బాసిజమే పనిచేస్తుంది. అధికారులు బదిలీ చేసిన స్థానాలకు మారుమాట్లాడకుండా ఉద్యోగులు వెళ్లాల్సిందే.

స్టేషన్ అమలు కాదు...

రెవెన్యూ శాఖలో బదిలీల ప్రక్రియ మొత్తం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉంటుంది. ప్రధానంగా ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి అనే నిబంధన విషయంలో 'స్టేషన్' అమలు కాదు. ముఖ్యంగా గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్‌ఓ) బదిలీల క్రమంలో మండలం స్టేషన్‌గా తీసుకోకుండా... గ్రామం స్టేషన్‌గా తీసుకుంటున్నారు. దీంతో పలువురు వీఆర్‌ఓలు ఒక మండలంలో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి బదిలీ అవుతున్నారే తప్ప ఆ మండలం వీడడం లేదు. ఇక డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు విషయంలో డివిజన్ స్టేషన్‌గా తీసుకోవడం లేదు. దీంతో వారు కలెక్టరేట్, ఆర్‌డీఓ, తహసీల్దారు, పౌర సరఫరాల కార్యాలయాల్లో... ఇలా ఇక్కడిక్కడే పోస్టింగ్ పొందుతూ ఒకే స్టేషన్‌లో ఏళ్లుగా పాతుకుపోతున్నారు. ఈ విమర్శలు రెవెన్యూ వర్గాల నుంచే వస్తుండం గమనార్హం.

జెడ్పీలో ఆరుగురికి పదోన్నతి


ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఆరుగురికి పదోన్నతి కల్పిస్తూ జెడ్పీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు ల్యాబ్ అసిస్టెంట్, ఓ రికార్డు అసిస్టెంట్‌కు జూనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించారు. వీరిలో భీమయ్య (గుమ్మఘట్ట), ఫకృద్దీన్ (సిద్దరాంపురం), లక్ష్మన్న (నాగసముద్రం), సాదిక్ బాషా (తగరకుంట), హరికృష్ణ (ముదిగుబ్బ), వెంకటేశులు (కళ్యాణదుర్గం) ఉన్నారు. వీరికి పదోన్నతుల ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అందజేసి, అభినందించారు. జిల్లా పరిషత్ యాజమాన్యం కింద పనిచేసే ఉద్యోగులకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఈఓ వెంకట సుబ్బయ్య తెలిపారు. చైర్‌పర్సన్ సమక్షంలో ఉదయం 9:30 గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుందన్నారు.

డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా నెట్టెం వెంకటేశులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) పర్సన్ ఇన్‌చార్జ్‌గా నెట్టెం వెంకటేశులు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్సన్ ఇన్‌చార్జ్‌గా నెట్టెం వెంకటేశులును ప్రకటిస్తూ పాలక వర్గం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసినట్లు డీసీఎంఎస్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రాష్ట్రంలో దగాకోరు పాలన

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: మహానాడులో చంద్రబాబు ప్రసంగం పరిశీలిస్తే అధికారం నుంచి దిగిపోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయనే బాధ స్పష్టంగా కనిపిస్తోందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఏడాది పాలనలో అన్ని విధాలుగా దగాపడ్డామనే అభిప్రాయానికి రాష్ట్ర ప్రజలు వచ్చారన్నారు. టీడీపీ, జనసేనతో పాటు ఇతర రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా ఇదే భావనలో ఉన్నారన్నారు. ఈ విషయంపై చంద్రబాబుకు సైతం స్పష్టత వచ్చిందని, అందుకే రానున్న రోజుల్లో అధికారం కోల్పోవాల్సి వస్తుందనే బాధ ఆయన మాటల్లో స్పష్టమైందన్నారు.

చెప్పుకునేందుకు వంద ఉన్నాయి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఇచ్చిన ప్రతి ఒక్క హామీనీ నెరవేర్చారన్నారు. మరోవైపు రాష్ట్రాభివృద్ధిని సైతం పరుగులు పెట్టించారన్నారు. జగన్ పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధిపై చెప్పుకునేందుకు వంద ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాది కాలంలో చెప్పుకునేందుకు ఏ ఒక్కటీ లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమల ఊసే లేదు కానీ, అన్నీ అమలు చేశానని చంద్రబాబు గొప్పలకు పోతున్నారని, ఆయనకు అల్జీమర్స్ పీక్స్‌కు వెళ్లిందనేందుకు ఇదే నిదర్శమన్నారు. ఈ పరిస్థితులను చూస్తూంటే ఆయన కుర్చీని లోకేష్‌బాబు లాక్కొనే టైం వచ్చిందనే అనుమానం కలుగుతోందన్నారు.

వ్యవస్థలన్నీ నాశనం

చంద్రబాబు ఏడాది పాలనలో రాష్ట్రంలో మెడికల్ కళాశాలల అమ్మకాలు, వెనుకబడిన ప్రాంతాల తాగు, సాగునీటి ప్రాజెక్టులు.. వలంటీర్ల వ్యవస్థ, ఉన్న ఉద్యోగాల రద్దు, సచివాయాలు, ఆర్బీకేలు, మహిళా సాధికారత, విద్యార్థుల భవిష్యత్తును చిదిమేశారన్నారు. నిరుద్యోగులను మోసం చేశారన్నారు. మొత్తం వ్యవస్థలన్నీ నాశనమయ్యాయన్నారు. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. పథకాల కోసం గొంతెత్తితే గొంతుకోస్తారనే భయాన్ని సృష్టించారన్నారు. రాష్ట్రానికి తనకు తాను బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునే చంద్రబాబు వాస్తవానికి కరువుకు, అపద్ధాలకు, దగాకోరు పాలనకు, వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అనే విషయాన్ని విస్మరించారన్నారు. అభివృద్ధి పేరుతో ఇబ్బడిముబ్బడిగా నిధులు కేటాయించి, వాటిని పక్కదారి పట్టించడంపై ఉన్న తపన నీళ్లు పారించే విషయంగా చంద్రబాబుకు లేదన్నారు. అందుకే రాయలసీమకు కాని, గ్రేటర్ రాయలసీమకు గాని తాగు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదన్నారు. గండికోట నుంచి గాలేరు–నగరి ద్వారా చిత్తూరు జిల్లాకు 20 టీఎంసీల నీళ్లు తీసుకెళ్లేందుకు జగన్‌మోహన్‌రెడ్డి పథకం తీసుకొచ్చి సగానికి పైగా పనులు చేస్తే చివరకు ఆ ప్రాజెక్ట్‌ను చంద్రబాబు రద్దు చేశారన్నారు. హంద్రీనీవా మొదటిదశను 6,300 క్యూసెక్కులకు వెడల్పు చేసి 23 టీఎంసీల నీటిని అదనంగా తీసుకొచ్చే పనులను ప్రారంభిస్తే ఆ ప్రాజెక్ట్‌నూ రద్దు చేశారన్నారు. నారా వారి పాలనపై రాయలసీమ ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, నాయకులు పొగాకు రామచంద్ర, కదిరి ఇస్మాయిల్, రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజి, గంగుల సుధీర్ రెడ్డి, బండిపవన్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య


రంగ (ఫైల్)

తాడిపత్రి రూరల్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామానికి చెందిన చాకలి రంగ (45)కు భార్య సులోచన, ఇద్దరు కుమారులు ఉన్నారు. చేనేత మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాఆపరుల వద్ద చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.3 లక్షలకు చేరుకుంది. అప్పులు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెందిన రంగ... శుక్రవారం కోమలి – జూటూరు గ్రామాల మధ్య ఉన్న పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాలిక అదృశ్యం

గార్లదిన్నె: మండలంలోని మర్తాడుకు చెందిన ఓ బాలిక కనిపించకుండా పోయింది. గార్లదిన్నెలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న బాలిక గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుట్టు చప్పుడు కాకుండా ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఉదయం నిద్ర లేచిన కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ తెలిపారు.

కనుకూరులో తల్లీబిడ్డ..

శెట్టూరు: మండలంలోని కనుకూరు గ్రామానికి చెందిన వివాహిత, తన బిడ్డతో సహా కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు.. కనుకూరుకు చెందిన బోయ మోహన్‌బాబు, హంసలత దంపతులకు నాలుగేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. గురువారం కూలీ పనులకు వెళ్లిన కుటుంబసభ్యులు సాయంత్రం ఇంటికి చేరుకునే సమయానికి హంసలతతో పాటు చిన్నారి కనిపించలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మోహన్‌బాబు ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ

అనంతపురం: జిల్లా కేంద్రంతో పాటు అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లోని కూడళ్లు, జాతీయ రహదారులపై శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించారు.

ఖాద్రీశుడి ఆలయం జలమయం


ఆలయం ముందు నీటితో నిండిన దృశ్యం

కదిరి టౌన్: 'నైరుతి' ప్రభావంతో శుక్రవారం ఉదయం కదిరిలో కుండపోత వర్షం కురిసింది. కాల్వలు పొంగిపొర్లాయి. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి భారీగా వరద చేరింది. ఆలయ ఆవరణ మొత్తం నీరు చేరడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే పట్టణంలోని వేమారెడ్డి సర్కిల్, అడపాలవీధి, అమీన్‌నగర్, కంచుకోట, వలీసాబ్ రోడ్డు, చౌక్‌బజారు, దేవాలయం బజారు, మార్కెట్, నిజాంవలీ కాలనీ, అంబేడ్కర్ సర్కిల్, ఇందిరాగాంధీ, జీవీమాను సర్కిల్, రాయలసీమ సర్కిల్‌లోని వీధులన్నీ జలమయమయ్యాయి.

స్వయం ఉపాధి పొందేదెన్నడు?

- బీసీ కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థుల నిరీక్షణ

అనంతపురం రూరల్: వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం (బీసీ కార్పొరేషన్) అందించే సబ్సిడీ రుణాల కోసం అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి కానీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నుంచి కానీ ఎటువంటి సమాచారమూ అందకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం బీసీల సంక్షేమం, వారి అభ్యున్నతి కోసం ఎంతో చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో అవేమీ కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి పథకంలోనూ బీసీలకు సముచిత న్యాయం జరిగింది. ఆయా సంక్షేమ పథకాల లబ్ధిని ఠంచన్‌గా అందుకున్న సంగతి తెలిసిందే. బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఐదు నెలల కిందట నోటిఫికేషన్ వచ్చింది. ఈ మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3,220 యూనిట్లకు 33,129 మంది బీసీ కులాల వారు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 1,728 యూనిట్లకు గాను 19,098 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 1,492 యూనిట్లకు 14,031 మంది దరఖాస్తు చేసుకోగా.. అధికారులు ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేశారు. ఆ తర్వాత లబ్ధిదారుల ఎంపిక.. రుణాల మంజూరు సమాచారం ఏదీ తెలియడం లేదని అభ్యర్థులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి రుణాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> **ఉత్తర్వులు రాగానే రుణాలిస్తాం**
>
> బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం నిరుద్యోగ యువత చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలు పూర్తి చేశాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే లబ్ధిదారులకు సమాచారం అందించి రుణాలు అందజేస్తాం.
>
> – సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్

బంగారు నగల అపహరణ

ధర్మవరం రూరల్: స్థానిక గీతా నగర్‌లో నివాసముంటున్న పోలేపల్లి కోన శేఖర్‌గుప్త ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.2.80 లక్షల నగదు, 5.8 తులాల బంగారు నగలను అపహరించారు. శుక్రవారం ఉదయం చోరీ విషయాన్ని గుర్తించిన బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఎస్‌ఏ ఇంగ్లిష్ ఖాళీలు పెంచాలని రెండోరోజూ ధర్నా


ధర్నాలో పాల్గొన్న బాధిత టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ టీచర్ల ఖాళీలు పెంచాలని డిమాండ్ చేస్తూ రెండోరోజూ శుక్రవారం అనంతపురంలోని శారదా నగరపాలక ఉన్నత పాఠశాలలో ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇంగ్లిష్ పదోన్నతుల అంశంపై హైకోర్టులో వేసిన కేసు పరిష్కారమైందన్నారు. 2023, జనవరి 26 నుంచి ఏప్రిల్ 30 వరకు రూ.2,500 గౌరవ వేతనంతో తాత్కాలిక పద్ధతిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ టీచర్లుగా పనిచేసిన ఎస్జీటీలకు ఇంగ్లిష్ టీచర్లుగా పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తం 230 ఖాళీలకు గాను కేవలం 19 మాత్రమే ఉన్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారని, వీటిని 2023లో తాత్కాలిక పద్ధతిలో ఇచ్చిన 230 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పదోన్నతుల ఖాళీలుగానే చూపాలని డిమాండ్ చేశారు. డీఎస్సీకి 30 శాతం కోటా 103 పోస్టులు కేటాయించి ఇందులో 70 శాతం ఇవ్వాల్సిన పదోన్నతులను కాదని కేవలం 19 మాత్రమే ఇస్తామనడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి సూర్యుడు, చంద్రశేఖర్, నాగభూషణ, జయరాం నాయక్, జయపాల్ నాయుడు, సురేష్, నరసింహులు, మురళి, భాస్కర నాయుడు, రవి, విజయ శ్రీ, పరిమళ, తులసి, మాధవి,ఆదిలక్ష్మి, కౌసర్ బాను పాల్గొన్నారు. ధర్నాకు ఎస్టీయూ రమణారెడ్డి, రామాంజనేయులు, యూటీఎఫ్ నాగేంద్ర, పీఆర్టీయూ విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌టీఏ నాగిరెడ్డి, శ్రీనివాసులు, రవినాయక్, నాగభూషణ, ఆర్‌ఈఎఫ్ నారాయణ నాయక్ మద్దతు తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

- రేపటి నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టండి
- అధికారులకు జేసీ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశం


సమీక్ష సమావేశంలో జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలన లక్ష్యంగా పనిచేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులతో శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జేసీ సమీక్షించారు. జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి బాలకార్మికులు, డ్రాపౌట్లను గుర్తించి సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. అత్యంత ప్రమాదకర పరిశ్రమల్లో పనిచేస్తున్న బాలలకు విముక్తి కల్పించాలన్నారు. బాలకార్మిక చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీధిబాలలు, యాచన చేస్తున్న వారిని గుర్తించడంతో పాటు పునరావాసం కల్పించాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ అభ్యర్థులపై 'తెలుగు' పిడుగు

- డీఎస్సీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నష్టపోనున్న 3 వేల మంది అభ్యర్థులు



పుట్టపర్తి: డీఎస్సీలో సీబీఎస్‌ఈ అభ్యర్థులకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. పదో తరగతిలో లాంగ్వేజ్-1లో తెలుగు చదివి ఉండాలనే నిబంధనతో సీబీఎస్‌ఈ అభ్యర్థుల నెత్తిన పిడుగు వేసింది.

రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోనున్న 20 వేల మంది

ఉపాధ్యాయ నియామకాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయటంతో పాటు డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15తో తుది గడువుగా పేర్కొంది. దీంతో ఇబ్బడి ముబ్బడిగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది అభ్యర్థులు సీబీఎస్‌ఈ విధానంలో చదువుకున్నవారున్నారు. వీరంతా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థలు, ప్రైవేట్ డీఎడ్ కళాశాలల్లో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసినవారే. అయితే డీఎస్సీ రాసే అభ్యర్థులు పదో తరగతిలో లాంగ్వేజ్-1లో తెలుగు చదివి ఉండాలనే నిబంధనను కూటమి ప్రభుత్వం చేర్చింది. వాస్తవానికి సీబీఎస్‌ఈ పదో తరగతిలో లాంగ్వేజ్-2 కింద తెలుగు ఉంటుందని, ఇక ఇంటర్మీడియట్‌లో తెలుగు సబ్జెక్టే ఉండదనే విషయాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించింది. దీంతో సీబీఎస్‌ఈ విధానం కింద చదువుకున్న రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది అభ్యర్థులు అర్హత కోల్పోయారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన 3 వేల మంది అభ్యర్థులు ఉన్నారు. ఇదే విషయమై హెల్ప్‌లైన్ ద్వారా అధికారులను అభ్యర్థులు సంప్రదించారు. పదో తరగతిలో లాంగ్వేజ్-1లో తప్పనిసరిగా తెలుగు సబ్జెక్టు ఉండాలని తెలపడంతో దరఖాస్తులో 'తెలుగు' అని పేర్కొన్నారు. దీంతో దరఖాస్తును ఇప్పటికి ఆమోదించినప్పటికీ పోస్టుల భర్తీ సమయంలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> **న్యాయం చేయాలి**
>
> 
>
> ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నాం. డీఎస్సీ కోసమని ఇప్పటికే చాలా డబ్బు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకున్నా. ఇప్పుడు తెలుగు నిబంధనతో ఇబ్బంది పెట్టడం సరి కాదు. మాకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి.
>
> – అనిల్, గంగవరం, అనంతపురం జిల్లా
>
> **స్పష్టత ఇవ్వాలి**
>
> 
>
> టెన్త్ సీబీఎస్‌ఈ సిలబస్‌లో తెలుగు సబ్జెక్టు లాంగ్వేజ్-2గా ఉంటుంది. అధికారులు మాత్రం డీఎస్సీ దరఖాస్తులో లాంగ్వేజ్-1లో తెలుగు ఉండాలంటున్నారు. అలాంటప్పుడు సీబీఎస్‌ఈ చదివిన మేమంతా అర్హత కోల్పోవాల్సి వస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టతనివ్వాలి. మాకు న్యాయం చేయాలి.
>
> – గజేంద్రకుమార్, హిందూపురం, శ్రీసత్యసాయి జిల్లా

క్లుప్తంగా

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



ఆత్మకూరులో యోగా చేస్తున్న అధికారులు

ఆత్మకూరు: యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యమని డాక్టర్ సబిహా సుల్తానా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసనాలు, సూర్యనమస్కారాలు చేశారు. యోగాతో మానసిక ప్రశాంతంత, ఆధ్యాత్మిక, శారీరక దృఢత్వం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కామాక్షి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ బాలకృష్ణుడు శుక్రవారం తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 15 గ్రామ పంచాయతీల్లో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు 6,800 ఉన్నాయని ఎంపీడీఓ తెలిపారు. ఇందుకోసం 2 కోట్లా 98 లక్షల 88వేల రూపాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు కృష్ణారెడ్డి(ఫైల్)

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి తెలిపారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం పూలకుంట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, చియ్యేడు గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి బైక్‌పైఈ ఈనెల5న బత్తలపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరారు. జాతీయ రహదారి నుంచి యర్రాయపల్లి గ్రామానికి రోడ్డు క్రాస్ చేస్తుండగా అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కృష్ణారెడ్డి(59) పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య దేవరపల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, కిశోర బాలికలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఐసీడీఎస్ అనంతపురం రూరల్ 5వ సెక్టార్ పరిధిలోని రాయల్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం వేసవి శిక్షణలో భాగంగా బాలికలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జయశ్రీ మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థిక నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కుటుంబ సంపాదన, అవసరాలు, పొదుపు జాగ్రత్తగా సమన్వయం చేసుకొని ముందుకు పోవాలన్నారు. దుబారా ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. పిల్లల చదువు, ఆరోగ్యం, అత్యవసర తదితర వాటితో పాటు విశ్రాంత జీవితంలో తగిన అవసరాల కోసం ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి జయచిత్ర, మహిళా పోలీస్ నజ్మా బేగం, మహిళా సంఘాల వీఓ శ్యామల, అంగన్‌వాడి సిబ్బంది పద్మావతి పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రాప్తాడు: మండలంలోని హంపాపురం క్రాస్‌లో పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీహర్ష శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ. 21,100 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పౌరహక్కులపై అవగాహన



అనంతపురం రూరల్ మండలంలో పౌరహక్కుల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అనంతపురం: పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పౌర హక్కులపై పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సంబంధిత సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులతో పాటు రెవెన్యూ, తదితర ప్రభుత్వ విభాగాలు సంయుక్తంగా వెళ్లి రాజ్యాంగంలోని చట్టాలు, పౌర హక్కుల గురించి తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆరా తీయడంతో పాటు కొన్నింటికి పరిష్కారం చూపారు.

ఐకమత్యంతో

'ముసలమ్మ' స్థలాన్ని కాపాడుకుంటాం



ఆలయం ఎదుట ఆందోళన చేస్తున్న భక్తులు, గ్రామస్తులు

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల కేంద్రంలోని గ్రామ దేవత ముసలమ్మ తల్లి దేవాలయం స్థలాన్ని ఐకమత్యంగా కాపాడుకుంటామని గ్రామస్తులు, భక్తులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముసలమ్మ ఆలయం ఎదుట వారు ఆందోళన నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వం వరదలు వచ్చి బీకేఎస్ చెరువు తెగినప్పుడు ముసలమ్మ ప్రాణత్యాగం చేసిందన్నారు. అప్పటి నుంచి గ్రామాన్ని రక్షిస్తూ వస్తున్న ముసలమ్మ తల్లి ఆలయానికి భద్రత లేకుండా పోయిందన్నారు. కొంత మంది నకిలీ పట్టాలు సృష్టించి ముసలమ్మ ఆలయ స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారన్నారు. అమ్మవారి స్థలాన్ని కాపాడేందుకు గ్రామస్తులంతా ఏకమై పరి రక్షించుకుంటామన్నారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామన్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుశీలమ్మ, సూర్యనారాయణరెడ్డి, ఎస్.నారాయణ స్వామి, సాకే రామక్రిష్ణ, నందినేని మల్లికార్జున, పురుషోత్తం, చికెన్ నారాయణ స్వామి, శేషానంద రెడ్డి, సురేష్, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం అర్బన్: ఏఐఎఫ్‌టీయూ (న్యూ) అనుబంధ ఆటో కార్మికుల నూతన కమిటీని ఎన్నికున్నారు. శుక్రవారం స్థానిక రజక నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆటో కార్మికుల మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి కిషోర్‌బాబు హాజరై మాట్లాడారు. విద్యావంతులై ఉండి స్వయం ఉపాధిగా ఆటోలు నడుపుకుంటూ అరకొర సంపాదనతో కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఆటో కార్మికులకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. మహాసభలో ఆటో యూనియన్ అధ్యక్షుడిగా వై.హాజీవలి, ఉపాధ్యక్షునిగా అరుణ్‌కుమార్, కార్యదర్శిగా ఎం.రాజు, సహాయ కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా షరీఫ్‌బాషా, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రచయిత సూర్యసాగర్, మానవత రక్తదాతల సంస్థ అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి, ఏఐఎఫ్‌టీయూ నేత సుధాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఖాళీలు భర్తీ చేయాలి



డీఆర్‌ఓ మలోలకు వినతిపత్రం అందిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: విద్యుత్ శాఖలో వివిధ కేడర్లలో ఖాళీగా ఉన్న 10 వేలకు పైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. డీఆర్‌ఓ ఎ.మలోలను శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్, ఇతర నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా సంస్థల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో ఉన్నవారిపై పనిభారం పడుతోందన్నారు. దీంతో వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖలో ఖాళీలను 10వేలకు పైగా పోస్టులను భర్తీ చేయడం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు ఉన్నవారిపై పనిభారం తగ్గుతుందన్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ధనుంజయ, నాయకుడు శ్రీనాథ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంతో ఇబ్బందులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం కల్చరల్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టంతో కలిగే ఇబ్బందులను కళ్లకు కట్టినట్టు చూపించిన రచయిత అభినందనీయులని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం ఆదర్శనగర్‌లోని బియబాని మసీదులో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ రఫీక్ రచించిన 'చట్టం ఎవరి చుట్టం?' పుస్తకావిష్కరణ జరిగింది. ఈసందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ పుస్తకంలో వక్ఫ్ సవరణ చట్టం కల్గించే అనర్థాలను చక్కగా వివరించారని, రాష్ట్రంలో ప్రతి ముస్లిం కుటుంబం చదవాల్సిన పుస్తకమని అభిప్రాయపడ్డారు. అందరినీ ఐక్యం చేయడానికి ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణలకు వ్యతిరేకంగా మళ్లీ నిరసనలు తెలియజేయడానికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, హాఫీజ్ వలీవుల్లా, జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు ఎండీ రఫీ, నగరాధ్యక్షుడు నవాజ్, ఎంపీజే జిల్లా ప్రతినిధి సులేమాన్, యాసర్ అహ్మద్, అనీసు రెహమాన్, యూజేఏసీ నాయకులు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

8న లౌకిక రాజ్య పరిరక్షణ సమితి సదస్సు

అనంతపురం టవర్‌క్లాక్: డీపీఆర్‌సీ భవన్‌లో జూన్ 8న లౌకిక రాజ్య పరిరక్షణ సమితి(ఎల్ఆర్‌పీఎస్) సదస్సు నిర్వహిస్తున్నట్లు సమితి నేత మండల రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కులాల, మతాల మధ్య ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడులు, విధ్వంసాలు జరుగుతున్నాయన్నారు. బీజేపీ నుంచి లౌకిక వాదాన్ని పరిరక్షించుకోవాడానికి ఎల్ఆర్‌పీఎస్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. లౌకిక వాదులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఓబులేసు, రవి, బొమ్మన్న, సోము, కళ్యాణ్, నాగరాజు, గోపాల్, మహేష్, రాజు, అంజి, మల్లేష్, వెంకటేష, తిమ్మరాజు, జంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం అర్బన్: కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తోందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం యూనియన్ కార్యాలయంతో పాటు నగరంలోని పలు చోట్ల నిర్వహించారు. మునిసిపల్ కార్మిక సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసి కార్యక్రమంలో నాగేంద్రకుమార్ సీఐటీయూ జెండాని ఆవిష్కరించి మాట్లాడారు. 1970లో సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి అవిశ్రాంత పోరాటాలు సాగిస్తూ కార్మిక వర్గానికి వెన్నుదన్నుగా ఉంటోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. వాటిని రద్దు చేసి 29 కార్మిక చట్టాల అమలు కోసం జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. నాయకులు ఆర్‌వీనాయుడు, రమాదేవి, వెంకటనారాయణ, ముత్తుజ, శ్రీనివాసులు, ఆజాంబాషా, ఆదినారాయణ, సురేంద్ర, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లికి చేరిన సబ్సిడీ విత్తన వేరుశనగ



ఓబుళంపల్లిలో విత్తన వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న రైతు భరోసా కేంద్రం సిబ్బంది,రైతులు

చెన్నేకొత్తపల్లి: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు అందజేసే సబ్సిడీ విత్తన వేరుశనగ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు చేరినట్లు ఏఓ ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండలానికి 1,900 క్వింటాళ్లు కేటాయించగా, అందులో ఇప్పటి వరకు 300 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు సరఫరా అయ్యాయని ఆయన తెలిపారు. మండలానికి కే-6 రకం విత్తన వేరుశనగ వచ్చాయని, వీటిని రైతు భరోసా కేంద్రాల్లో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. విత్తన వేరుశనగ కాయలు 30కిలోల మొత్తం ధర రూ.2,790 కాగా, అందులో సబ్సిడీపోనూ రైతులు రూ.1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

చదువుతో పాటు సంస్కారం అవసరం



మాజీ జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం చాలా అవసరమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏపీఎస్ఎఫ్), ఇన్‌స్పైర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈసందర్భంగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కారం నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థులు బాగా చదివి మన దేశానికి సేవ చేయాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ మల్లికార్జున, మానసిక వైద్య నిపుణులు ఎండ్లూరి ప్రభాకర్, ఏపీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, వేణుగోపాల్, శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ తోట శరత్ చంద్ర, తేజశ్వర్‌రెడ్డి, రవికుమార్‌, గిరిధర్ ప్రసాద్ రాయ్ పాల్గొన్నారు.

మల్లేశ్వరమ్మ సేవలు మరువలేనివి



ఆయుష్ వైద్యాధికారి మల్లేశ్వరమ్మను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: ఆయుష్ వైద్యాధికారిణిగా మల్లేశ్వరమ్మ సేవలు మరువలేనివని పీహెచ్‌సీ వైద్యాధికారి శివ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆయుష్ వైద్యశాలలో ఆయుష్ వైద్యాధికారిణి మల్లేశ్వరమ్మ ఉద్యోగ విరమణ సన్మాన సభ వైద్యాధికారి శివ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆమెతో పాటు ఆమె భర్త విజయభాస్కర్‌రెడ్డికి షష్టి పూర్తి వేడుకలు, విజయ భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు, మల్లేశ్వరమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. విజయకుమార్ రెడ్డి ఉపాధ్యాయుడు కావడంతో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీజీబీ విశ్రాంత మేనేజర్ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు కులశేఖర్ రెడ్డి, సీహెచ్‌ఓ శివ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, పార్మాసిస్టు మూర్తి, సూపర్ వైజర్లు అరుణమ్మ, నరసింహ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సనాతన ధర్మమే దేశానికి రక్ష



పాదయాత్ర చేస్తున్న యువకుడు రోహిత్ కశ్యప్

కనగానపల్లి: హిందూ మతంలోని సనాతన ధర్మమే దేశానికి రక్ష అని రోహిత్ కశ్యప్ తెలిపాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్ కస్యప్ సనాతన ధర్మ పరిరక్షణ జెండా, జాతీయ జెండాలను కావిడికి కట్టుకొని 7 వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తున్నాడు. జాతీయ రహదారి మీదుగా సాగుతున్న పాదయాత్ర శుక్రవారం దాదులూరు సమీపానికి చేరుకుంది. ఈ సందర్భంగా రోహిత్ కశ్యప్ మాట్లాడారు. దేశంతో పాటు ప్రపంచ దేశాల్లో పెట్రేగుతున్న ఉగ్రవాద, అరాచక శక్తులు అంతం కావాలని అందరూ కోరుకుంటున్నారన్నారు. దేశంలో హిందూమతంలోని సనాతన ధర్మ పరిరక్షణే దేశాన్ని కాపాడుతుందన్నారు. ఇందుకోసం తాను ఉత్తరప్రదేశ్‌లోని లక్కాపూర్ నుంచి పాదయాత్రను ప్రారంభించి, దేశంలోని అన్ని పవిత్ర పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ, కాశీలోని అమర్‌నాథ్ వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

అనంతపురం కార్పొరేషన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సచివాలయ ఉద్యోగులపై వేధింపులు ఆపాలని రిజర్వేషన్ పరిరక్షణ సమితి నాయకులు మునిసిపల్ ఆర్‌డీ విశ్వనాథ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమలోని వివిధ మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో కొందరు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సచివాలయ ఉద్యోగులను సర్వేల పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. పారిశుధ్య కార్యదర్శులకు ప్రభుత్వం కల్పించిన రెస్ట్ హవర్స్‌లోనూ సర్వేల పేరుతో ఇబ్బందులు పెడితే ఎలాగని ప్రశ్నించారు. కార్యక్రమంలో రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర, నాయకులు ఎల్లన్న, జీవీ ఉజ్వల్, నగేష్, ముత్యాలరాజు, ఆదినారాయణ, తిప్పేస్వామి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక విద్య' అభ్యర్థులకు 'సీఆర్ఈ' శిక్షణ



శిక్షణకు హాజరైన అభ్యర్థులు, రీసోర్స్‌పర్సన్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాల పిల్లల బోధన కోసం 'ప్రత్యేక విద్య' కోర్సు చేసిన అభ్యర్థులకు విశ్వ భారతి కళానికేతన్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సీఆర్ఈ (నిరంతర పునరావాస విద్య)పై మూడు రోజుల శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం రెండోరోజుకు చేరుకుంది. తపోవనం సర్కిల్‌లో ఓ ప్రైవేట్ భవనంలో జరిగిన శిక్షణకు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ టీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. రిసోర్స్ పర్సన్లుగా మారెప్ప, వలీబా, పవన్ కుమార్, సురేష్, మహమ్మద్ అలీ, కొండా లోకేష్ రావు వ్యవహరించారు. స్పెషల్ బీఈడీ, స్పెషల్ డీఎడ్ చేసిన అభ్యర్థులు ఇలాంటి శిక్షణ తరగతులను తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. శిక్షణ ద్వారా ప్రత్యేక విద్య బోధనలో నైపుణ్యాలను మరింత పెంచుకోవచ్చన్నారు. శిక్షణకు హాజరైన అభ్యర్థులకు రోజుకు 6 పాయింట్ల చొప్పున మూడు రోజులకు 18 పాయింట్లను రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్సీఐ) వారు కేటాయిస్తారన్నారు. దాదాపు 180 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

క్రమశిక్షణకు మారు పేరు 'ఎన్‌సీసీ'

- కర్నూల్ గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి



క్యాడెట్లతో మాట్లాడుతున్న కర్నూల్ గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి

కూడేరు: ఎన్‌సీసీతో సత్ప్రవర్తనతోపాటు క్రమశిక్షణ అలవడుతుందని కర్నూల్‌కు చెందిన ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి అన్నారు. బ్రాహ్మణపల్లి వద్ద ఎన్‌సీసీ నగర్‌లో ఆరో ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ అనంతపురం ఆధ్వర్యంలో సీఏటీసీ-1 ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. శుక్రవారం గ్రూప్ కమాండర్ ఎన్‌సీసీ నగర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఆయన క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత క్యాడెట్లకు ఫైరింగ్, డ్రిల్, మార్చ్‌ఫాస్ట్, మ్యాప్ రీడింగ్, ఇతర అంశాలపై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. క్యాడెట్లకు కల్పిస్తున్న మౌలిక వసతులను తనిఖీ చేశారు. తర్వాత ఆయన క్యాడెట్లతో సమావేశమై మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆయన తెలియజేశారు. శిక్షణలో ప్రతిభ కనభరిచిన క్యాడెట్లను గ్రూప్ కమాండర్ అభినందించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి, లెఫ్టినెంట్ ఎస్.పావని, మేజర్ బల్‌బీర్ సింగ్, జేసీఓలు కైలాస్‌బంకర్, రామచంద్ర, ఎన్‌సీసీ అధికారులు నవీన్ కుమార్, ఎం.ఎండీ ముదస్సర్, ఎం.సంతోష్, 500 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

విడపనకల్లు: ఉండబండ వీరభద్రస్వామి ఆలయంలో ఈఓ విజయ్‌కుమార్ సమక్షంలో హుండీ కానుకలు శుక్రవారం లెక్కించారు. పది నెలలకు గాను రూ.12,63,028 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో పాల్తూరు ఎస్ఐ మురహరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను కీలక పోస్టుల్లో నియమించాలి

అనంతపురం టవర్‌క్లాక్: ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను అన్ని శాఖల్లో కీలక పోస్టుల్లో నియమించాలని అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్జీవోహోంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో 1993లో ఛీఫ్ సెక్రటరీ ఆరోరా ఇచ్చిన ఆదేశాల ప్రకారం అన్ని శాఖలల్లో కీలక పోస్టులు ఎస్సీ, ఎస్టీలను నియమించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇవ్వకపోవడంతో ఎన్నోకష్టాలు పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల విషయంతో చిత్తశుద్ధి చూపాలని కోరారు. సంఘం నేత సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన నవ అహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచి స్వామికి అభిషేకాలు, అర్చనలు, హారతి, మహామంగళ హారతి, మండల పూజలు, తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నరసింహ స్వామికి అర్చకులు, వేదపండితులు కల్యాణం జరిపించగా భక్తులు అక్షింతలు అందజేసి స్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మట్కా బీటర్ అరెస్టు

పెద్దవడ్డూరు: మండలంలోని చాగల్లులో మట్కాబీటర్ పక్కృద్దీన్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. అతడి నుంచి రూ.12,150 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని తాడిపత్రి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలి

- కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రాయుడు



రైతులకు సూచనలిస్తున్న కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ఈ చంద్రాయుడు

కళ్యాణదుర్గం: రైతులు పంటల సాగు విషయంలో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రాయుడు సూచించారు. శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మండలం పాలవాయి, మల్లాపురం, కంబదూరు మండలం తిమ్మాపురం, ఓబిగానిపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటల సాగులో పాటించాల్సిన సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మట్టి పరీక్షల ఆధారంగా పంట ఎంపిక వంటి వాటిపై రైతులకు పూర్తిగా అవగాహన కల్పించారు. వేరుశనగ, కంది ఆముదం, పత్తి వంటి ఉద్యాన పంటలు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని తెలిపారు. అనంతరం ఉద్యాన వన శాఖ, పశు సంవర్ధక శాఖ శాస్త్రవేత్తలు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అధికారులు గౌసియా, అరుణ, శ్వేత, శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, మల్లికార్జున, శిరీష, యుగంధర్‌లతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా కుందుర్పమ్మ ఉత్సవం



పూజలు అందుకున్న కుందుర్పమ్మ

కుందుర్పి: కుందుర్పి ప్రజల ఆరాధ్య దైవం కుందుర్పమ్మ అమ్మవారి ఉత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. ఉదయం అమ్మవారికి పాలాభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం గ్రామోత్సవం, సాయంత్రం అంకురార్పణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు, హోమాలు, తమలపాకుల పూజ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతరాయుడు, సర్పంచ్ రామూర్తి,వార్డు సభ్యుడు మంజునాథ్, మహిళా విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.